# పదవీ విరమణ చేసిన అధికారులను
## సత్కరించిన ఎస్పీ కృష్ణకాంత్




నేటి దినపత్రిక
సూర్య
18వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం | 05 ఫిబ్రవరి 2025 | పేజీలు 8


### వైసీపీ విధానం నచ్చలేదని చెప్పే కార్పొరేటర్లు
# రాజీనామా చేయాలి

■ మాజీ మంత్రి కాకాణి వెల్లడి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విప్‌ను ఉల్లంఘించి తెలుగుదేశం పార్టీకి మద్దతు పలికిన కార్పొరేటర్లు ప్రజల దృష్టిలో ద్రోహులనే ముద్ర వేసుకున్నారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి వెల్లడించారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ బీఫారంపై పోటీ చేసే సాహసం కూడా చేయలేదని వైసీపీ నుంచి వెళ్లిన వారికే డిప్యూటీ మేయర్ పదవి ఇచ్చారని పేర్కొన్నారు. వైసీపీ విధానాలు నచ్చలేదని చెప్పే కార్పొరేటర్లు తమ పదవులకు కూడా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ బీఫారం ఇవ్వలేదని చెప్పడానికి ప్రిసైడింగ్ అధికారిగా ఉన్న జేసీ కూడా భయపడ్డాడని వివరించారు. విప్ గురించి కనీస పరిజ్ఞానం లేని వ్యక్తులు టీడీపీలో ఉన్నారని పేర్కొన్నారు. జూదంలో ఓడిన పాండవులు కురుక్షేత్ర యుద్ధంలో గెలిచారని గెలుపోటములు శాశ్వతం కాదన్నారు. వైసీపీ జారీ చేసిన విప్ దెబ్బకు టీడీపీ భయపడిందన్నారు. పార్టీ కోసం నిలబడిన కార్పొరేటర్లకు భవిష్యత్తులో

-మిగతా 2లో

# రాష్ట్ర పండుగగా రథసప్తమి

■ అరసవెల్లి సూర్య దేవాలయం నుంచి శ్రీకారం
■ రాష్ట్రవ్యాప్తంగా పురాతన ఆలయాలకు పూర్వవైభవం
■ రూ.38 కోట్లతో నెల్లూరు జిల్లాలో 18 ఆలయాల పునర్నిర్మాణానికి చర్యలు
■ రాష్ట్రవ్యాప్తంగా శైవ క్షేత్రాల్లో మహా శివరాత్రికి విస్తృత ఏర్పాట్లు
■ మంత్రి నారాయణతో చర్చించి మూలాపేట శివాలయం అభివృద్ధికి చర్యలు
■ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :**

సమస్త మానవళికి వెలుగులు ప్రసాదించే సూర్య భగవానుడికి అత్యంత ప్రీతికరమైన రథసప్తమిని రాష్ట్ర పండుగగా ప్రకటించినట్లు రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. మంగళవారం రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని నెల్లూరు నగరంలోని మూలాపేట శ్రీ మూలస్థానేశ్వరస్వామి ఆలయాన్ని మంత్రి సందర్శించి మహాశివుడిని, అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలోని సూర్య భగవానుడిని దర్శించుకుని ప్రత్యేక అభిషేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. అరసవెల్లిలోని ప్రముఖ సూర్య భగవానుడి ఆలయం నుంచి రాష్ట్రవ్యాప్తంగా రథసప్తమి వేడుకలకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అరసవెల్లిలో ముఖ్యమంత్రి పట్టువస్త్రాలు సమర్పించాల్సి ఉండగా, ఆ ప్రాంతంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున దేవాదాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రభుత్వ లాంఛనాలతో పట్టు వస్త్రాలు సమర్పించినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆలయాల్లో ఘనంగా రథసప్తమి పూజా కార్యక్రమాలను దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు చెప్పారు. గత ప్రభుత్వం ఆలయాలను పూర్తిగా విస్మరించిందని, తమ ప్రభుత్వం ఆలయాల పవిత్రత, సనాతన ధర్మం పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రవ్యాప్తంగా పురాతన ఆలయాలను ఆగమశాస్త్రం ప్రకారం పున:నిర్మించి పూర్వవైభవానికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. నెల్లూరు జిల్లాలో 18 ప్రసిద్ధ ఆలయాల

-మిగతా 2లో

### కోవూరులో హాస్టళ్లను తనిఖీ చేసిన
# ఏపీ స్టేట్ ఫుడ్ కమిషనర్



బాలికల హాస్టల్స్‌ను తనిఖీ చేయడానికి వస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాపరెడ్డి..

2లో

### రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధికి కేంద్రం
# కేంద్రం పెద్దపీట

■ ఎంపీ వేమిరెడ్డి



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం భారీ స్థాయిలో నిధులు కేటాయించడంపై నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

వివరాలు 3లో

### ఘనంగా ముగిసిన సీపీఎం
# 27వ మహాసభలు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) ఆంధ్రప్రదేశ్ 27వ రాష్ట్ర మహాసభలు మూడు రోజులు నెల్లూరులో ఘనంగా నిర్వహించారు. పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో ఎన్నో ఉద్యమాల్లో.. ఎన్నో పోరాటాలలో పాల్గొన్న కామ్రేడ్‌లు, ఎన్నో సంవత్సరాల తర్వాత నెల్లూరులో మహాసభలు జరగడంతో పార్టీ నాయకత్వం, ఎర్రసైన్యం మొత్తం కదలి.. కసిగా అహర్నిశలు కష్టపడి పని చేసి.. ఎక్కడా ఎన్నడూ జరగనంతగా

-మిగతా 2లో

# నాణ్యత లేని పొగాకు పండిస్తే రైతులకు నష్టాలే !



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పొగాకు బోర్డు మరియు పొగాకు కంపెనీ ప్రతినిధులతో కూడిన రైతు మిత్ర బృందం మంగళవారం డీసీ.పల్లి పొగాకు బోర్డు పరిధిలోని ఆత్మకూరు మండలం జాలయ్య నగరం, ముస్తాపురం, నెల్లూరు పాలెం, రావులకొల్లు, మర్రిపాడు మండలం డీసీ.పల్లి గ్రామాలను సందర్శించి పొగాకు పంటను, పొగాకు క్యూరింగ్‌ను పరిశీలించారు. రైతులకు తగిన సూచనలను తెలియజేశారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి జి.రాజశేఖర్, కందుకూరు వేలం కేంద్రం ఎస్జీఓ శివకుమార్, ఫీల్డ్ ఆఫీసర్ ఆదర్శ్, ఐటీసీ ప్రతినిధి వెంకటరావు, జీపీఐ ప్రతినిధి శ్రీనివాసరావు పాల్గొన్నారు. రైతులకు సూచనలు అందిస్తూ ప్రపంచవ్యాప్తంగా పొగాకు ఎక్కువగా పండించటం జరిగిందని, అలాగే మన రాష్ట్రమంతా పొగాకు సాగు డిమాండు కన్నా ఎక్కువగా పెరిగిందని, దీనివలన ధరలు ఆశించినంత లేకపోవచ్చని, కావున ఇప్పటికీ కూడా పొగాకు నాటాలనుకునే రైతులు మానుకోవాలని, ఇపుడు నాటే పొగాకు నాణ్యత రాదని, నాణ్యత లేని పొగాకును పండించడం వలన నష్టాలు వచ్చే ప్రంపదం ఉందని తెలియజేశారు. అలాగే రైతులు మంచి నాణ్యత ఉన్న పొగాకు పండించాలని, దానికి కావలసిన మంచి వ్యవసాయ పద్ధతులు అన్ని పాటించాలని, అనగా మంచి నారును ఎన్నుకోవటం, డిసెంబరులోపు నాట్లు వేయటం, నత్రజనికి సంభందించిన ఎరువులు మోతాదుకు మించి వేయకపోవడం, పొటాష్‌కి సంబంధించిన ఎరువులు తప్పనిసరిగా వేయటం, అవసరం మేరకే పురుగు మందులు తగిన మోతాదులో మాత్రమే వాడటం,కలుపు లేకుండా అంతర సేద్యలు చేసుకోవటం, మంచి పక్వానికి వచ్చిన ఆకులని మాత్రమే రేల్చడం, పండిపోయిన ఆకులని వదిలేయటం, బారన్లలో వెయ్యి కర్రలులోపు పెట్టి ఓవర్‌లోడ్ కాకుండా చూడటం, బారన్ ఫైర్ ఆక్సిడెన్డ్ కాకుండా ఇనుప జాలరును అమర్చడం, క్యూరోమీటర్‌ను వాడటం, బారన్ నుండి దించిన కర్రలను పందిల్ల కింద పెట్టడం, మండేలు చిన్నవిగా వేసుకోవటం, పొగాకును కింద వేయకుండా తార్పల్ పట్టలు పైన వేయటం వంటి పద్ధతులు పాటించటం వలన మంచి నాణ్యమైన పొగాకు పండించవచ్చని తెలియజేశారు. కొన్ని పొలాలలో పొగాకు మల్లె ఉందని, దీనికి వచ్చే పంట కాలంలో పొగాకు వేయకుండా నువ్వు వంటి పంటలతో పంట మార్పిడి చేయాలని, లేకుంటే పొగాకు మల్లెను నియంత్రించలేమని తెలియజేశారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు సిబ్బంది, పొగాకు రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధికి కేంద్రం పెద్దపీట : ఎంపీ వేమిరెడ్డి

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం భారీ స్థాయిలో నిధులు కేటాయించడంపై నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గారు హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి 9,417 కోట్లు కేటాయించి రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధికి ఊతం ఇచ్చారని అభిప్రాయపడ్డారు. ఈ కేటాయింపు గత యూపీఐ ప్రభుత్వ కేటాయింపుల కన్నా, 11 రెట్లు ఎక్కువ అని ఆయన అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రూ.84,559 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు నడుస్తున్నాయని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనిక నాయకత్వానికి ఇది నిదర్శనమన్నారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో మరిన్ని ప్రాజెక్టులు రానున్నాయన్నారు. నెల్లూరు రైల్వే స్టేషన్ అభివృద్ధికి 103 కోట్లు ఖర్చు చేస్తుండడంపై జిల్లా ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రస్తుతం ఏపీలోని 16 జిల్లాల మీదుగా 8 వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయన్న కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్.. త్వరలో మరిన్ని వందే భారత్ రైళ్లను కేటాయిస్తామని చెప్పడం సంతోషకరమన్నారు. అలాగే 110, 130, 160 కిలోమీటర్ల వేగంతో రైళ్లు నడవడానికి వీలయ్యే వివిధ రైల్వేట్రాక్‌లను ఏపీలో అభివృద్ధి చేయనుండటం ద్వారా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు.

## కోవూరులో హాస్టళ్లను తనిఖీ చేసిన ఏపీ స్టేట్ ఫుడ్ కమిషనర్



**కోవూరు, మేజర్‌న్యూస్ :** కోవూరు మండల కేంద్రంలోని బాలిక ఉన్నత పాఠశాలలో బాలికల హాస్టల్స్‌ను ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప రెడ్డి పరిశీలించారు. హాస్టల్లో అమలవుతున్న మెనూను అడిగి తెలుసుకొని, హాస్టల్ వార్డెన్స్ అందరూ పిల్లలందరికీ నాణ్యమైన భోజనాన్ని అందించాల ని ఆయన తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఏపీ ఫుడ్ కమిషన్ అనే ది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిచ్చే ఉచిత ఆహారానికి భద్రత కల్పించే దిశగా పనిచేస్తుందని, పేదలకు అందించే రేషన్, అంగన్వాడీలకు చిన్నారులకు గర్భిణీ స్త్రీలకు, హాస్టళ్లకు స్కూళ్లకు అందజేసే ఆహారాన్ని పరిశీలించడం జరుగుతుందని, మొదటి కానుక 5 వేలు, రెండో కాన్పులు పాప డెలివరీ అయితే 6 వేలు ఈ పథకాలు ఇచ్చేవిధంగా ఈ ఫుడ్ కమిషన్ పనిచేస్తుంద న్నారు. ఫుడ్ కమిషన్ సంబంధించి మీకేమైనా సమస్యలుంటే ఈ వాట్సాప్ నంబర్ (9490551117)కి వీడియోలు పంపవచ్చని, వాటిపై మేము చర్యలు తీసుకుంటామన్నారు. ఏపీలో హాస్టల్స్‌లో ఆకలి మరణాలు ఉండకూడదని ఏపీ ఫుడ్ కమిషన్ పని చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన సీపీఎం 27వ మహాసభలు

(మొదటి పేజీ తరువాయి)

మహాసభలను విజయవంతం చేశారు. రాష్ట్రం నలుమూలల నుండి కామ్రేడ్‌లు అందరిని సభలకు తరలించడంలో జిల్లా నాయకత్వం కృషి అభినందనీయం. రాష్ట్ర, దేశ నాయకుల రాకతో సింహపురి ఎరుపెక్కింది. ముఖ్యంగా ఈ మహాసభలు దిగ్విజయంగా జరగడానికి జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా కష్టపడ్డారు. మహాసభలకి వచ్చిన కేంద్ర, రాష్ట్ర నాయకత్వం వారి ప్రసంగాలతో కార్యకర్తలను ఉత్తేజపరచి వారు కసిగా పార్టీ కోసం పని చేయడానికి నూతనోత్సాహం నింపారు. అసలు కమ్యూనిస్టు పార్టీ ఎక్కడ ఉంది.. అని మాట్లాడే వారికి మహాసభలకు వచ్చిన ఎర్ర దండుని చూసి నోరెళ్ళబెట్టేలా కార్యక్రమం నిర్వహించారు. చివరి రోజు మహాసభకు ఏ దిక్కున చూసిన ఎరుపెక్కి పోయింది. పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసి వారిని ఉత్తేజపరిచారు. రాష్ట్ర కమిటీని కూడా అనవాయితీగా నెల్లూరులోని మహాసభలలో ఎన్నిక జరగడం విశేషం. పార్టీ పరంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాల్సిన అవశ్యకతను కామ్రేడ్‌లకు వివరించారు. ఇళ్ల స్థలాల పోరాటాలు, భూ పోరాటాలు, రైతు, కార్మిక పోరాటాలు నిర్వహించి అనేకమంది ప్రజలకు సీపీఎం అండగా నిలబడిందన్నారు. మహాసభల ముఖ్య ఉద్దేశాలను కామ్రేడ్‌లకు వివరించి ప్రజల కోసం చేయాల్సిన పోరాటాలలో వారి భాగస్వామ్యాన్ని గుర్తు చేశారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. భాజపా ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై ప్రజా మద్దతుతో వారిపై పోరాడేందుకు సిద్ధమన్నారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్మార్ట్ మీటర్‌లను వ్యతిరేకించి అధికారంలోకి రాగానే వాటిని స్వాగతించడం దారుణమన్నారు. ప్రజల కోసం నిరంతరం పోరాడే పార్టీ సీపీఎం అని, ప్రజల కోసం మన కామ్రేడ్‌లు ఎన్ని పోరాటాలకైనా సిద్ధంగా ఉండాలని వివరించారు. దళితుల కోసం సీపీఎం ఎన్ని పోరాటాలకైనా సిద్ధంగా ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా ఈ సభలకు కేంద్ర, రాష్ట్ర నాయకత్వాన్ని నెల్లూరులో ఒక్క వేదికపైకి తీసుకుని వచ్చిన జిల్లా నాయకులు తీవ్రంగా శ్రమించి మహాసభలను విజయవంతం చేయడంలో సఫలమయ్యారు. ఇదే స్ఫూర్తితో సీపీఎం నిత్యం ప్రజల కోసం పోరాడుతుందని రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు.

## పదవీ విరమణ చేసిన అధికారులను సత్కరించిన ఎస్పీ కృష్ణకాంత్

**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్.. ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబం, పిల్లల కోసం తల్లిదండ్రులు ఎంతో కష్టపడి, ఎన్నో త్యాగాలు చేసి ఉంటారని.. వారి యోగక్షేమాలు చూసుకోవడం పిల్లల బాధ్యత అన్నారు. చిన్న పలకరింపే తల్లిదండ్రులకు ఎంతో మనోధైర్యం, ఆనందాన్నిస్తుందన్నారు. ఓపికతో బాగా చూసుకోవాలని చెప్పారు. ఎంతో నిబద్ధత, అంకితభావంతో జిల్లా పోలీస్ శాఖకు అందించిన సేవలను ఎప్పటికీ గుర్తుంచుకుంటుందన్నారు. పదవీవిరమణ పొందాక ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి, వ్యాయమ క్రియలు, పుస్తక పఠనం వంటి ఆసక్తి గల అలవాట్లను అలవరుచుకోవాలన్నారు. ఎలాంటిది అవసరమైనా సంప్రదించండి.. ఏ సమయంలోనైనా అందుబాటులో ఉండి తోడ్పాటును అందించడం జరుగుతుందన్నారు. కావలి ఒన్‌టౌన్‌లో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేసిన ఎస్ఐ అంబేద్కర్, పీసీఆర్‌లో విధులు నిర్వహిన్న ఏఎస్ఐ కృష్ణయ్య , బిట్రగుంట ఏఎస్ఐ సుధాకర్ రెడ్డి, దగదర్తి ఏఎస్ఐ మోహన్ రావు, గూడూరు వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, కుటుంబ సభ్యులు, పోలీసు అధికారులు, సిబ్బంది సమక్షంలో జ్ఞాపికతో, పూలమాలలతో సత్కరించి, వారి సేవలను కొనియాడి.. ఎస్పీ ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సౌజన్య, డీఎస్పీలు సింధుప్రియ, శ్రీనివాసరావు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు మద్దిపాటి ప్రసాద్, అసోసియేషన్ నాయకులు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర పండుగగా రథసప్తమి

(మొదటి పేజీ తరువాయి)



పున:నిర్మాణానికి రూ.38 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా మహా శివరాత్రి పర్వదినాన్ని అన్ని ప్రముఖ శైవ క్షేత్రాల్లో అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు విస్తృతమైన ఏర్పాట్లు చేపట్టేలా అధికారులకు ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. శ్రీకాళహస్తి, ద్రాక్షారామం, శ్రీశైలం, మహానంది, కోటప్పకొండ మొదలైన ప్రసిద్ధ శైవక్షేత్రాల్లో భక్తుల రద్దీకనుగుణంగా, భక్తులందరూ సంతృప్తికరంగా మహాదేవుడిని దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. నెల్లూరు మూలాపేట శివాలయంతో తమ కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉందన్న మంత్రి, ప్రతి ఏటా రథసప్తమి పూజలను తమ కుటుంబం ఆధ్వర్యంలో ఉభయదాత లుగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. నెల్లూరు సిటీ ఎమ్మె ల్యే, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణతో కలిసి శివాలయాన్ని సందర్శించి ఆలయ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం పురాతన రాతి కట్టడాలకు రంగు వేసి వాటి రూపుకోల్పోయేలా చేసిందని, తమ ప్రభుత్వ హయాంలో అన్ని ఆలయాల్లోని రాతికట్టడాలను యధావిధిగా ఉంచేలా, రంగులను తొలగించి పూర్వం ఎలా ఉన్నాయో, అదేవిధంగా నిర్మించేందుకు చర్యలు చేపట్టినట్లు మంత్రి స్పష్టం చేశారు. భవిష్యత్ తరాలకు మన ఆలయాల విశిష్టత, చరిత్ర తెలిసేలా, వేదాలు, ఆగమ శాస్త్రాలను తూచ తప్పకుండా పాటిస్తూ.. సనాతన హిందూ ధర్మ పరిరక్షణే లక్ష్యంగా తమ ప్రభుత్వం ఆలయాల పూర్వవైభవానికి దృఢ సంకల్పంతో పని చేస్తుందని మంత్రి చెప్పారు. ఆ ఆదిత్యుని దివ్య తేజోవంతమైన వెలుగులతో ప్రతి ఒక్కరి జీవితం ఆనందమయం కావాలని, రాష్ట్ర ముఖ్యమంత్రికి, రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రజలందరిపై సూర్య భగవానుడి ఆశీస్సులు మెండుగా ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్లు కోవూరు జనార్దన్‌రెడ్డి, జె.శ్రీనివాసరావు, ఈవో అర్వభూమి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## వైసీపీ విధానం నచ్చలేదని చెప్పే కార్పొరేటర్లు రాజీనామా చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

సముచిత స్థానం కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో పోలీసులు చేతులెత్తేశారని, టీడీపీ, జనసేన అరాచకాలు చేసినా పోలీసులు పట్టించుకోలేదని పేర్కొన్నారు. నెల్లూరు కార్పొరేషన్, బుచ్చి నగరపాలక పంచాయతీలలో విప్ ధిక్కరించిన వారిపై వేటు వేయాలని ఎన్నికల అధికారులను కలుస్తున్నామన్నారు. కార్పొరేటర్లు, కౌన్సిలర్లు పదవిలో ఉన్నప్పుడే అనర్హత వేటు వేసేలా న్యాయస్థానాన్ని కోరుతామన్నారు. సమావేశంలో కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఖలీల్ అహ్మద్ పాల్గొన్నారు.

# అస్థవ్యస్థంగా ఆత్మకూరు మున్సిపల్ పాలన

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో మున్సిపల్ పాలన అస్థవ్యస్థంగా ఉందని సర్వత్రా వ్యాఖ్యానిస్తున్నారు. ప్రజలచేత ఎన్నుకోబడిన కౌన్సిలర్లు పరిపాలన గురించికానీ, సమస్యల గురించి కానీ పట్టించుకుంటున్న దాఖలాలు కానరావడం లేదు. పట్టణంలో కొన్ని ప్రాంతాలకు చెత్తసేకరణ వాహనాలు వెళ్ళడం లేదని పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో దోమలు, వానరాలు, గోమాతల బెడద తీవ్రంగా ఉంది. దోమల నివారణకు బ్లీచింగ్ చల్లడం కానీ, మలాథియాన్ పిచికారీ చేయించడం కానీ, ఫాగింగ్ చేయించడం కానీ ఏళ్ళ తరబడి జరగడం లేదు. ఈవిషయమై మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో ప్రజాప్రతినిధులు నోరువిప్పిన దాఖలాలు లేనేలేవు. అసలు క్రమం తప్పకుండా మున్సిపల్ సమావేశాలు కూడా జరగడం లేదని పలువురు కౌన్సిలర్లే వ్యాఖ్యానిస్తున్నారు. మున్సిపాలిటీ స్థాయి పెరిగినా తదనుగుణంగా కార్మికులు, సిబ్బంది పెరగడం కానీ, సౌకర్యాలు మెరుగుకావడం కానీ లేదు. అనేక విస్తరణ ప్రాంతాల్లో రోడ్లు నిర్మించలేదు. డ్రైనేజి వ్యవస్థ అస్థవ్యస్థంగా ఉంది. సైడు కాలువల్లో మురుగునీరు సాఫీగా దిగువకు వెళ్లే పరిస్థితి లేదు. కాలువను శుభ్రం చేయడం కూడా తరచూ జరగడం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం, శాంతినగరం, వీవర్స్‌కాలనీ తదితర ప్రాంతాల్లో ఆక్రమణలు విరివిగా ఉండగా ఏళ్ళ తరబడి తరచూ విచారణలు అంటుంటారే తప్ప ఏమాత్రం చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. ప్రస్థుతం ఆత్మకూరు నియోజకవర్గానికి రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి శాసనసభ్యులుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన అబివృద్ధికి నిలువెత్తు చిహ్నంగా గతంలో చేసిచూపారు. ఈదఫా కూడా ఆత్మకూరు మున్సిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దాలని, అన్ని సౌకర్యాలు కల్పించాలని



ధృఢ సంకల్పంతో ఉన్నారు. ఆయన లక్ష్యాలకనుగుణంగా ఇక్కడి పాలకులు స్పదించడం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. టిడ్కో గృహాల్లో పలు సౌకర్యాలు కల్పించాల్సి ఉన్నా ఏళ్ళ తరబడి నిర్లక్ష్యం చేస్తున్నారు. ఐదారు వందలమంది అక్కడ నివాసాలుంటుండగా వారికోసం ప్రత్యేకంగా రేషన్‌సరుకుల పంపిణీకి ఒక దుకాణం ఏర్పాటు చేయాలని వారు అనాదిగా కోరుతున్నా పట్టించుకునే నాధుడే లేరు. అక్కడే ఒక అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నా అతీగతీ లేదు. మంత్రి రామనారాయణరెడ్డి ప్రత్యేక శ్రద్ధతో టిడ్కోగృహసముదాయంలో ఒక రామాలయ నిర్మాణానికి ఈనెల 9వతేదీ పర్యటించనున్న ఐదుమంది మంత్రుల బృందం శంఖుస్థాపన గావించనున్నారు. మున్సిపల్ బస్టాండు వద్ద ప్రయాణీకులకు కనీససౌకర్యాలు కల్పించకపోగా తాగునీటిని శ్రీసాంబశివచారిటబుల్‌ట్రస్ట్ చైర్మెన్ కంచి పరమేశ్వరరెడ్డి ఏర్పాటు చేశారు. అక్కడ ప్రయాణీకులకు సరిపడా బెంచీలు కూడా ఏర్పాటు చేయలేదు. ఈ అంశాలన్నింటిపై మంత్రి ఆనంరామనారాయణరెడ్డి దృష్టి సారిస్తేనే ఫలితం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మున్సిపాలకుల్లో స్పందన లభిస్తుందేమో చూడాల్సి ఉంది.

# రాష్ట్రంలో ముగిసిన తెలుగుదేశం సభ్యత్వనమోదు

▶ టాప్‌టెన్‌లో ఆత్మకూరు ▶ శాశ్వతసభ్యత్వంలోనూ టాప్ ▶ సత్తాచాటిన మంత్రి 'ఆనం'



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో తెలుగుదేశం సభ్యత్వ నమోదు ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి మండలాలవారీగా సమీక్షాసమావేశాలు నిర్వహించి తెలుగుదేశం సభ్యత్వ నమోదును లక్ష్యంకన్నా అధికంగా చేయాలని సూచించడంతో నియోజకవర్గంలోని ఆత్మకూరు అర్బన్, ఆత్మకూరు రూరల్, మర్రిపాడు, ఏఎస్‌పేట, అనంతసాగరం, చేజర్ల, సంగం మండలాల్లో రాష్ట్ర, నియోజకవర్గ, పట్టణ, మండ, గ్రామస్థాయి నాయకులు రెట్టింపు ఉత్సాహంతో ఊరూవాడా పర్యటిస్తూ ఆన్‌లైన్ ద్వారా ఓటర్లను టీడీపీ సభ్యులుగా చేర్పించారు. సభ్యత్వనమోదు ముగియగా ఆత్మకూరు నియోజకవర్గం రాష్ట్రంలోని తొలిపది స్థానాల్లో చోటుచేసుకుంది. ఓటర్ల శాతం పరంగా రెండవ స్థానం, ఓటర్ల సంఖ్యాపరంగా నాలుగవ స్థానం లభించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ల ఆదేశాలు, ఇక్కడ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అభివృద్ధి ప్రదాతగా పేరుగాంచి ఉండడంతో నాయకులు ఉత్సాహంగా తెలుగుదేశం సభ్యత్వాలు నమోదు చేయించారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2లక్షలా13వేలా 899మందికాగా 1,48,919మంది సభ్యులుగా నమోదయ్యాయి. రాష్ట్రంలో టిడిపి సభ్యత్వంలో తొలిపది స్థానాల్లో ఆత్మకూరు నిలిచింది. ఓటర్ల సంఖ్యాపరంగా మొదటి స్థానం నెల్లూరు సిటి నియోజకవర్గం, రెండవస్థానం రాజంపేట నియోజకవర్గం, మూడవస్థానం పాలకొల్లు నియోజకవర్గం, నాలుగవస్థానం ఆత్మకూరు, ఐదవస్థానంలో కుప్పం నియోజకవర్గం, ఆరవస్థానం ఉండి నియోజకవర్గం, ఏడవస్థానం గురజాల నియోజకవర్గం, ఎనిమిదవ స్థానం వినుకొండ నియోజకవర్గం, తొమ్మిదవ స్థానం మంగళగిరి నియోజకవర్గం, 10వస్థానం భీమ్లి నియోజకవర్గాలు నిలిచాయని ఆపార్టీ వర్గాలద్వారా తెలిసింది. మొత్తం ఓటర్లు, నమోదైన ఓటర్ల సంఖ్య పరంగా అయితే ఆత్మకూరు నియోజకవర్గం ద్వితియస్థానంలో ఉందన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో టిడిపి సభ్యత్వనమోదులో పోటాపోటీగా చేయించారని, నియోజకవర్గ లక్ష్యాన్ని అధిగమించాలనే పట్టుదలగా సాగించారని, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సభ్యత్వ నమోదులో సత్తాచాటారని, శాశ్వతసభ్యత్వాలు కూడా 170కిపైగానే చేయించారని చెబుతున్నారు. ఆత్మకూరు పట్టణంలో తెలుగుదేశం పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, ఇతర నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, ఇందూరు వెంకటరమణారెడ్డి, గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, చల్లా రవికుమార్‌రెడ్డి, తదితరులు, ఆయా వార్డుల టిడిపి కౌన్సిలర్లు, టిడిపి నాయకులు ముమ్మరంగా సభ్యత్వనమోదు కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర తెలుగుమహిళ కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, రాష్ట్ర తెలుగుదేశం కార్యదర్శి దావా పెంచలరావు, నియోజకవర్గ టీడీపీ నాయకులు తాళ్ళూరు గిరినాయుడు, పుట్టం బ్రహ్మానందరెడ్డి, కాటంరెడ్డి రవీంద్రారెడ్డి తదితరులతోపాటు ఆయా మండలాల టిడిపి నాయకులు, ఆత్మకూరు మండలంలో మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సుంకర పెంచలచౌదరి, కేతా విజయభాస్కరరెడ్డి, తదితరులంతా మంత్రి ఆనం ఆదేశాలమేరకు టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు. రాష్ట్రంలోనే ఆత్మకూరు నియోజకవర్గాన్ని రాష్ట్రస్థాయిలో టాప్‌టెన్‌లో నిలపడం విశేషం.

## ఈ పంట తప్పనిసరి

**విడవలూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని ప్రతి రైతు ఈ పంటను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి వెంకట కృష్ణయ్య తెలిపారు. మండలంలోని పార్లపల్లి, చౌకచర్ల గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండ లంలోని ప్రతి రైతు ఈ పంటను నమోదు చేయించుకోవడం ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా వారి ధాన్యాన్ని సేకరించినందుకు అవకాశం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి రైతు ఈ పంటను నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ విషయంలో వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు కూడా రైతులకు అవగాహన కల్పించి ఈ పంట నమోదుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.




పాఠశాల విలీనప్రతిపాదనతో..

## నువ్వురుపాడులో ఆందోళన

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన పాఠశాలల విలీన ప్రక్రియకు సంబంధించి 117జివోను నేటి ప్రభుత్వం రద్దుచేసి సరికొత్త విధానాలతో పాఠశాలల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టగా అందులోభాగంగా పాఠశాలల విలీనప్రక్రియ కూడా ఉండడంతో పలుగ్రామాల్లో జనాలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని నువ్వురుపాడు గ్రామంలోని పాఠశాలను ఆగ్రామ మజరా అయిన అశ్వనీపురం పాఠశాలలో విలీనం చేసేలా ప్రతిపాదించారన్న సమాచారంతో నువ్వురుపాడు గ్రామస్థులు ఆందోళన చెందున్నారు. ఈమేరకు సోమవారం ఆర్డీవో, ఎంయివో, తహశిల్దారులకు వినతిపత్రాలు కూడా సమర్పించారు. ప్రభుత్వ లక్ష్యం ఏదైనా పంచాయతీ కేంద్రంగా ఉన్న నువ్వురుపాడు పాఠశాలను నాలుగు కిలోమీటర్లలోని మజరా గ్రామమైన అశ్వనీపురం పాఠశాలలో విలీనం చేయబూనడం చిన్నారులకు మరింత అసౌకర్యం, ఇబ్బంది కానుంది. ప్రతిరోజూ చిన్నారులు నువ్వురుపాడునుండి పొలాలమద్య రోడ్డుపై నాలుగు కిలోమీటర్ల దూరం వెళ్ళిరావడం అత్యంత ఇబ్బంది, ఆందోళనకరమని గ్రామస్థులు ఆవేదనతో చెబుతున్నారు. ప్రభుత్వం పునరాలోచించి తమ గ్రామంలోనే పాఠశాలను కొనసాగించేలా నిర్ణయించాలని నువ్వురుపాడు గ్రామస్థులు కోరుతున్నారు.

## పుట్టుకతో లోపాలున్నవారికి ప్రభుత్వ సేవలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని జిల్లాప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో ఉన్న బాలభవిత కేంద్రంలో పుట్టుకతో ఏదేని లోపాలున్న వారికి వైద్యసేవలందిస్తున్నామని ఈకేంద్ర వైద్యాధికారి తెలిపారు. కొందరికి వంకరపాదాలు, గ్రహణమొర్రి, తదితర 12లోపాలుంటాయన్నారు. అలాంటి వారికి ప్రభుత్వబాలభవిత కేంద్రంలో వైద్యసేవలు లభిస్తాయన్నారు. పురిటిబిడ్డలనుండి 18సంవత్సరాలలోపువారికిఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. న్యూరల్‌ట్యూబ్ డిఫెక్ట్‌లు, డౌన్‌సిండ్రోమ్, గ్రహణమొర్రి, వంకరపాదాలు, పుట్టుకతోనే వినికిడిలోపం, సంక్రమిత కంటిపొర, గుండెసంబంధిత వ్యాధులు, నాడీమండల సమస్యలు, జ్ఞానపరంగా అభివృద్ధిలో ఆలస్యం, మాటలు సరిగా రాకపోవడం తదితర సమస్యలకు చికిత్స అందిస్తామన్నారు. ఈ కేంద్రంలో చిన్నపిల్లల వైద్యులు, వైద్యాధికారి, డెంటల్ వైద్యులు, సామాజిక కార్యకర్తతోపాటు మానసికంగా అభివృద్ధిలేని పిల్లలకు విడతలవారీగా సైకాలజిస్ట్ కౌన్సిలింగ్ చేస్తారన్నారు. శారీరక ఎదుగుదల లోపాలున్నవారికి ఫిజియోథెరపి సౌకర్యం కూడా ఉందన్నారు. ల్యాబ్ సౌకర్యంతోపాటు కంటివిభాగం, స్టాఫ్‌నర్సులు కూడా ఉన్నారని, అవసరమైన వారు ఈ బాలభవితకేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## వరి పంటలో ఎలుకల నివారణ చర్యలు

**చేజర్ల, మేజర్‌న్యూస్ :** వరి పంటలో ఎలుకలపై సామూహికంగా నివారణ చర్యలు తీసుకోవడం ఎలా అనే పొల్లం పిలుస్తుంది కార్యక్రమాన్ని చేజర్ల మండలంలోని మాముడురు, తూర్పుపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శశిధర్, గ్రామ రైతులు పాల్గొన్నారు. ఇందులో ఎలుకల నివారణకు కావలసిన ఎరను తయారు చేసుకునే విధానము రైతులకు వివరించారు. ఎరలో 100 గ్రాములకు గాను 96 గ్రాములు వరి తవుడు,రెండు గ్రాములు నూనె, రెండు గ్రాములు బ్రోమోడైలీన్ మందును కలిపి ఉండలుగా చేసుకొని వరి పొలాల్లో లోని ఎలుకల బోరియల్లో పెట్టవలేనని సూచించారు. ఇది గ్రామంలోని రైతులందరూ సామూహికంగా చేయడం వల్ల మొత్తం ఎలుకలు నివారించబడతాయన్నారు. ఒక హెక్టారుకు 10 గ్రాముల ప్రకారం రైతు భరోసా కేంద్రం ఆధ్వర్యంలో 100 గ్రాములు పది మంది రైతులకు ఇచ్చి మొత్తం 25 ఎకరాలు కవర్ అయ్యే విధంగా క్షేత్రస్థాయిలో డెమో ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది శ్రీను, నితీష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# అన్ని ప్రాంతాల్లో విద్యుత్ వీధి దీపాలను ఏర్పాటు చేయండి

## - కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో విద్యుత్ స్తంభాలకు వీధి దీపాలను అమర్చి వాటి నిర్వహణను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని స్థానిక 8వ డివిజన్ పత్తి వారి స్కూల్ మెయిన్ రోడ్డు, కుమ్మరి వీధి, గొండ్ల వీధి, ముకుందా పురం, లక్ష్మీ సాయి నగర్, బివిఎస్ గర్ల్స్ హై స్కూల్ మెయిన్ రోడ్డు, తడికల బజారు, ఆర్ఎస్ఆర్ స్కూల్ పరిసర ప్రాంతాలలో కమిషనర్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని అన్ని వీధుల్లో క్రమంతప్పకుండా డ్రైన్ కాలువల పూడికతీత, సిల్టు ఎత్తివేత పనులను చేపట్టాలని సూచించారు. డ్రైను కాలువలు, రోడ్ల నిర్మాణం అవసరమైన ప్రాంతాలను గుర్తించి ప్రణాళికలను సిద్ధం చేయాలని కమిషనర్ సూచించారు. వార్డు సచివాలయ భవనాల ముందు ప్రజలకు తెలిసేలా తప్పనిసరిగా బోర్డులు ఏర్పాటు చేసి సచివాలయం ద్వారా అందించే పౌర సేవలు, కార్యదర్శుల విధివిధానాలను ప్రదర్శించాలని కమిషనర్ ఆదేశించారు.బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేసే వారిని గుర్తించి తొలి దశగా హెచ్చరించాలని పునరావృత్తం చేస్తే భారీ స్థాయిలో జరిమానాలు విధించాలని కమిషనర్ తెలియజేశారు. అదేవిధంగా డివిజన్ పరిధిలో వీధి కుక్కల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ప్రతి ఇంటికి సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకొనేలా భవన యజమానికి అవగాహన కల్పించాలని కమిషనర్ అధికారులకు కార్యదర్శులకు, సిబ్బందికి సూచించారు. అనంతరం స్థానిక తడికల బజార్ సమీపంలోని అన్న క్యాంటీన్‌ను కమిషనర్ సందర్శించారు. క్యాంటీన్లో ప్రజలకు అందుతున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. ప్రతి ఒక్కరికి టోకెన్ విధానం ద్వారానే ఆహారాన్ని అందించాలని, సమయంకు అందేలా పర్యవేక్షించాలని నిర్వాహకులకు కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రామ్ మోహన్ రావు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, ఈఈ రహంతు జానీ, వెటర్నరీ వైద్యులు డాక్టర్ మదన్ మోహన్, ప్రదీప్ కుమార్, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బ్రహ్మ దేవం ఆక్రమణలు సర్వేపై రాజకీయం లేదు



● దుష్ప్రచారం చేస్తున్నారని అధికార పార్టీ విమర్శ

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** బ్రహ్మ దేవం గ్రామపంచాయతీలో రెండు రోజుల క్రితం ప్రభుత్వ శాఖల అధికారులు చేసిన ఆక్రమణ సర్వే విషయంలో ఎలాంటి రాజకీయం లేదని ఇది కేవలం చట్టపరమైన అంశమని ఈ విషయాన్ని రాజకీయం చేస్తున్నారని రాజకీయ పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని అధికార పార్టీ ఖండిస్తుందని ఆ పార్టీ నాయకులు తిరుమలశెట్టి సతీష్ నాయుడు అన్నారు. మంగళవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీలు ఆక్రమణ సర్వే విషయంలో గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేపల్లి ఎమ్మెల్యే, పెద్దాయన అయినటువంటి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి ఈ సర్వేకు ఎలాంటి సంబంధం కానీ రాజకీయం ఏమి లేదని అధికార పార్టీ నాయకులు తిరుమల శెట్టి అన్నారు. నలుగురికి మంచి చేసే తత్వం కలిగిన ఎమ్మెల్యే సోమిరెడ్డికి ఉందన్నారు. ఇప్పటికైనా అసత్యపు ప్రచారాలు మానుకోవాలని ఆయన హితవు పలికినారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లేందుకు తాముసిద్ధంగా ఉన్నామని గ్రామస్తులంతా కలిసి రావాలని పేర్కొన్నారు. ఇలాంటి సర్వేలు ఇప్పటికే మూడుసార్లు జరిగినట్లు పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగి వేసిన పిటీషన్ వల్ల అధికారులు ఆక్రమణలపై సర్వే చేసినారు తప్ప రాజకీయం జోక్యం లేదన్న విషయాన్ని ఆయన సమగ్రంగా వివరించారు. ఈ సమావేశంలో మైనార్టీ అధ్యక్షులు షేక్ అలిముత్తు, మాజీ ఎంపీపీ దీనయ్య, నాటారి నాగేంద్రబాబు, పార్టీ కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# వేదగిరిపై రథసప్తమి సందర్భంగా సప్త వాహన సేవలు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** రూరల్ మండలం నరసింహకొండపై వెంచేసియున్న వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం మంగళవారం ప్రప్రథమంగా ఏర్పాటు చేసిన సప్త వాహన సేవలు, చక్ర స్నానం కార్యక్రమాలు ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు వైదిక పర్యవేక్షణలో కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి ఆధ్వర్యంలో వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య భక్తుల గోవింద నామ స్మరణల మధ్య అత్యంత వైభవంగా జరిగాయి. ముందుగా సూర్యప్రభ వాహనం, అనంతరం వరుసగా శేష వాహనం, హనుమంత వాహనం, గరుడ వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనం ఇవ్వగా చక్ర స్నానం అనంతరం సింహ వాహనం, హంస వాహనం, చంద్రప్రభ వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనం ఇచ్చారు అనంతరం ఏకాంత సేవతో సప్త వాహన సేవలు ముగిశాయి. వాహన సేవలలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే సతీమణి సుజితమ్మ పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సప్త వాహన సేవలను తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో అర్చకులు కృష్ణమాచార్యులు, మురళీధరా చార్యులు, అప్పలచార్యులు, రాఘవ చార్యులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు. చివరగా ప్రప్రథమంగా ఏర్పాటు చేసిన సప్త వాహన సేవలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి తెలియజేశారు. ఈ కార్యక్రమాలకు సహకరించిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి ప్రత్యక కృతజ్ఞతలు తెలిపారు.



# సీసీ రోడ్లు నాణ్యత ఏఈ పరిశీలన

**సీతారాంపురం, మేజర్‌న్యూస్ :** సీతారామపురం ఆదర్శ పాఠశాల కస్తూరిబా బాలికల పాఠశాల వద్ద ఇటీవల వేసిన సిమెంట్ రోడ్లను డి.మణి కుమార్‌తో కలిసి నాణ్యత ప్రమాణాలు పరిశీలించినట్లు పంచాయతీరాజ్ ఏఈ తిరుమలయ్య తెలిపారు. మంగళవారం పూర్తయిన రెండు రోడ్ల కొలతలను సేకరించమని తెలిపారు. రోడ్లపై క్యూరింగ్ అయ్యే విధంగా నీళ్లు పోయాలని రోడ్డు నిర్మించిన వారికి సూచించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుమతి, రఘులు పాల్గొన్నారు.

## ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని అప్ప సముద్రం గ్రామంలో గండిపాలెం వైద్యాధికారిని డాక్టర్ ఎన్.వినీత ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ నివారణదినోత్సవ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. క్యాన్సర్ తొలిదశలో గుర్తించిన ఎడల పూర్తిగా నివారించుకోగలమని ఆమె తెలిపారు. ఇందుకోసమే వైద్య సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి క్యాన్సర్‌పై స్క్రీన్ నిర్వహిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా స్త్రీలలో వచ్చేటువంటి క్యాన్సర్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య బోధకులు వెంకటసుబ్బయ్య ఆరోగ్య శాఖ సిబ్బంది, అప్పసముద్రం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి అమ్మకు సద్ది, పొంగళ్ళు



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని వరిణి గ్రామంలో వెలసిన మహా లక్ష్మమ్మ వారికి మంగళవారం సద్ది పొంగళ్ళు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక సర్పంచ్ రావెళ్ల మల్లికార్జునరావు దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి సద్ది, పొంగళ్ళు నైవేద్యంగా అందజేశారు. ఇలా మూడు వారాలు పాటు చేయడం జరుగుతుందని, అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడం మానవహితగా వస్తుందని స్థానికులు తెలిపారు.

## జిల్లాస్థాయిలో లుంబిని విద్యార్థులు ప్రతిభ



**చేజర్ల, మేజర్‌న్యూస్ :** జిల్లా స్థాయిలో జరిగిన ఎంఎంటీఎస్‌ఈ పరీక్షల్లో తృతీయ స్థానంలో లుంబిని విద్యాలయం నిలిచింది. ఆ పాఠశాల విద్యార్థులు కూరపాటి హిమవర్ష కొమ్మి లక్ష్మి ఉదతా అనూష లకు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులను లుంబిని యాజమాన్యం అభినందనలు తెలియజేశారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. మేము వివరించే బోధనా పద్ధతులు పిల్లలు బాగా అర్థం చేసుకుని మండల నియోజకవర్గ జిల్లా స్థాయిలో రాణిస్తూ పాఠశాల పేరు ప్రఖ్యాతలను నిలబెడుతున్నారని విద్యార్థులను కొనియాడారు. లుంబిని యాజమాన్యం కరస్పాండెంట్ పి.రమేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు పలు కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌లో ప్రతిభ కనపరుస్తూ పాఠశాలకు గుర్తింపును తీసుకురావడంలో వారి ప్రయత్నం చాలా గొప్పదని తల్లిదండ్రులు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా అనేక రకాల బోధనా పద్ధతులను విద్యార్థులకు వివరిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు.

## వైభవంగా గంధమహోత్సవం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని చింతల్లో వెలసి ఉన్న అబ్దుల్లా హబ్బీహెబ్ వారి గంధవ హెూత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హక్కుదారుల ఇంటి నుంచి గంధాన్ని పకీరు జరుబులు, బాణసంచా పేలుళ్ల నడుమ పట్టణ పురవీధుల్లో ఊరేగింపుగా గంధాన్ని దర్గాకు చేర్చారు. చదివింపుల అనంతరం గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు. గంధమహోత్సవానికి హిందూ, ముస్లింలు అధికసంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ప్రసాదాలు స్వీకరించారు.

# మార్చి చివరి నాటికి ఆనకట్ల సుందరీకరణ పనులు పూర్తి

**జలవనరుల శాఖ ఎస్ఈ దేశనాయక్**



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మార్చి చివరి నాటికి ఉదయగిరి ఆనకట్ట సుంద రీకరణ పనులు పూర్తి చేయనున్నట్లు జలవనరుల శాఖ ఎస్ఈ దేశనాయక్ పేర్కొన్నారు. మంగళవారం అధికారులతో కలిసి ఆనకట్ట సుందరీకరణ పనులు తనిఖీ చేసి మ్యాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. గ్రామ కోలను పథకంలో భాగంగా 2022లో జిల్లాలో 38చెరువుల సుందరీకరణ పనులకు రూ.70కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. సుందరీకరణ పనుల్లో భాగంగా చెరువుల కట్టల ను ఆధునికీకరించడం, వాకింగ్ ట్రాక్, దీపాలు, ప్రజలకు ఆహ్లాదకర వాతా వరణం అందించడంతోపాటు వారు సేదతీరేందుకు బెంచీలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం మారడంతో కొన్ని అనివార్య కార ణాల వల్ల పనుల్లో జాప్యం జరిగిందన్నారు. ప్రస్తుతం ఉదయగిరి, రాపూరు, సీతారామపురం మండలాల్లో పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఉదయగిరి అనకట్టకు రూ.7కోట్ల మేర పనులు జరిగాయన్నారు. జిల్లాలో ఇప్పటివరకు పదకంలో భాగంగా రూ.15కోట్లు ఖర్చు చేయడం జరిగిం దన్నారు. పనులు ప్రారంబించని గ్రామాల్లో మరలా మరో పథకం ద్వారా చెరువుల సుందరీకరణకు చర్యలు తీసుకొంటామన్నారు. అలాగే మండలం లోని పాన్నెబోయిన చెంచురామయ్య గండిపాళెం జలాశయం. లింగాల చెరువులను పరిశీలించారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ చంద్రమౌళి, ఏఈలు వేణు, సురేషలు పాల్గొన్నారు.

# ఈ పంటలో రైతులు సాగు చేసిన విస్తీర్ణాన్ని నమోదు చేసుకోవాలి




**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** మంగళవారం బుచ్చిరెడ్డిపాలెం మండలంలోని పెనుబల్లి, జొన్నవాడ రైతు సేవా కేంద్రాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కోవూరు సహాయ వ్యవసాయ సంచాలకులు డి.సుజాత మాట్లాడుతూ.. ప్రతి రైతు తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాలలో ఉన్నటువంటి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ సంప్రదించి ఈ పంటలో వారు సాగు చేసిన విస్తీర్ణాన్ని నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఈ పంటలో నమోదైన రైతులకు మాత్రమే ప్రభుత్వం ఏర్పాటు చేసేటువంటి దాన్యం కొనుగోలు కేంద్రాలలోవారి ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ పంట చేసుకున్న ప్రతి రైతు తప్పనిసరిగా ఈ కేవైసీ కూడా చేయించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుచ్చి రెడ్డిపాలెంమండల వ్యవసాయ అధికారి ఎం.సురేంద్రరెడ్డి మాట్లాడుతూ.. మాని పండు తెగులు నివారణకు ప్రోపికొనజోల్ 1 మిల్లీలీటరు/ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఎస్.ఇందు, వీఏఏ ఎన్.రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

# దీన్ దయాళ్ అంత్యోదయ యోజన కింద ఏపీకి ఎంత కేటాయించారు

**● ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దీనదయాళ్ అంత్యోదయ యోజన-జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎంత నిధులు కేటాయించారని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి లోక్‌సభలో ప్రశ్నించారు. మంగళవారం ఈ మేరకు పలు అంశాలపై ఆయన లోక్‌సభలో ప్రశ్నించారు. ఈ మిషన్ 2023-24 నాటికి పది కోట్ల మంది మహిళలకు చేరువ కావాలని ప్రభుత్వం నిర్ణయించింది వాస్తవమా అని ఆరా తీశారు. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకించి నెల్లూరు జిల్లాలో మిషన్ అమలు చేయబడిన బ్లాకుల వివరాలు, ఆంధ్రప్రదేశ్‌కు డే ఎన్ఆర్ఎల్ఎం కింద కేంద్ర కేటాయింపులు ఎన్నని కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చింది. 2023-24 నాటికి దీనదయాళ్ అంత్యోదయ యోజన-నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్ కింద 10కోట్ల గ్రామీణ కుటుం బాలను ఎస్‌హెచ్‌జిలుగా మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. మార్చి 2024లోనే ఈ లక్ష్యాన్ని సాధించామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి 13.33 కోట్లు కాగా.. రూ. కేంద్ర వాటాగా 8కోట్లలో రూ.2 కోట్లు విడుదల చేశామన్నారు.



# రైతు సేవ కేంద్రాలలో అందుబాటులో యూరియా




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి మండలంలోని రైతు సేవా కేంద్రాలలో యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయ అధికారి ఆంజనేయ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం శకునాలపల్లి, కృష్ణంపల్లి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం ఉదయగిరి వ్యవసాయ అధికారి ఆంజనేయులు నాయక్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన రైతులను ఉద్దేశించి రైతు సేవ కేంద్రాలలో యూరియా అందుబాటులో ఉంది రైతులకు ఎంఆర్పి ధరలకే విక్రయించాలని కోరారు. పంట వేసిన ప్రతి రైతు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేయించుకోవాలని తెలియజేశారు. క్రాసింగ్ మొక్కజొన్న, సజ్జ వేసిన రైతులు తప్పనిసరిగా విత్తన కంపెనీల దగ్గర అగ్రిమెంటు రాయించుకోవాలని సలహా ఇచ్చారు. అనంతరం ఆయన వరి, క్రాసింగ్ సజ్జ పంటలను క్షేత్రస్థాయిలో పరీక్షించి సలహాలు సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, సహాయ వ్యవసాయ సహాయకులు, ఏఈఓ వినోద్ పాల్గొన్నారు.

# ఆస్తి పన్ను బకాయిల వసూళ్లను వేగవంతం చేయండి : డిప్యూటీ కమిషనర్ చెన్నుడు



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగర పాలక సంస్థ పరిధిలోని ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్ను, షాపు రూముల బాడుగల వసూళ్లకై నిర్దేశించిన లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేసి, 100శాతం లక్ష్యాలను సాధించాలని డిప్యూటీ కమిషనర్ చెన్నుడు రెవెన్యూ విభాగం అధికారులు, సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. నెల్లూరు నగర పాలక సంస్థ రెవెన్యూ విభాగం అధికారులు, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులతో కమాండ్ కంట్రోల్ విభాగంలో మంగళవారం వారాంతపు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ.. పన్నుల వసూళ్లకు ప్రతిరోజు ఉదయం నుంచి క్షేత్రస్థాయిలో వసూళ్ల కొరకు పర్యటించాలని సూచించారు. గత వారములో నిర్దేశించిన విధంగా కోటి రూపాయల పన్ను వసూళ్ల లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. పన్ను బకాయిలు ఉన్న ప్రతి ఒక్క ఆస్తి యజమానికి నోటీసులు జారీ చేసి నిర్దేశించిన సమయంలోపు చెల్లించని పక్షంలో తాగునీటి కుళాయి కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరికలు తెలియజేయాలన్నారు. అందుబాటులో లేని భవన యజమానులను ఫోన్ ద్వారా సంప్రదించి ఆన్‌లైన్ పేమెంట్ చేయించేలా తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి నెల 31వ తేదీ నాటికి నిర్దేశించిన లక్ష్యాలను అందుకోని కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే కొత్తగా నిర్మించిన భవనాలు, అదనంగా నిర్మించిన అంతస్తులు, మార్పులను, ఖాళీ స్థలాలను గుర్తించి పన్ను పరిధిలోకి తీసుకొని రావలసిందిగా ఆదేశించారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఇన్స్పెక్టర్లు, వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విప్‌ను దిక్కరించిన కౌన్సిలర్ల పై చర్యలు తీసుకోవాలి



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్ న్యూస్ :** ఈనెల 3వ తేదీన జరిగిన బుచ్చి నగర పంచాయతీ వైస్ చైర్మన్‌ల ఎన్నిక అప్రజాస్వామ్యంగా జరిగిందని మూడో తేదీ ఎలక్షన్ ఆఫీసర్ గావచ్చిన డీపీఓ శ్రీధర్ రెడ్డికి నెల్లూరులోని డీపీఓ కార్యాలయంలో కలిసిఎన్నిక ఏ విధంగా అప్రజాస్వామ్యంగా జరిగిందో సాక్షాధారాలు అందజేసి త్వరగా చర్యలు తీసుకోవాలని కోరిన బుచ్చి నగర పంచాయతీ 5వ వార్డ్ కౌన్సిలర్ షేక్ షాహుల్. ఆయన వెంట డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి వీరి చలపతిరావు, బుచ్చి మండల పార్టీ అధ్యక్షులు చెర్లో సతీశ్ రెడ్డి, వైయస్సార్సీపీ సీనియర్ నాయకులు బాలశంకర్ రెడ్డిపాల్గొన్నారు.

# క్యాన్సర్ల పై అవగాహన సదస్సు, ర్యాలీ




**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మంగళవారం వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా నోరు, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ లపై అవగాహన సదస్సు జరిగింది. హెూమీబాబా క్యాన్సర్ ఆసుపత్రి పరిశోధన కేంద్రం, టాటా మెమోరియల్ సెంటర్, (ముంబై యూనిట్)అణు పరిశోధన విభాగం (భారత ప్రభుత్వం) నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ వైద్య నిపుణులు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, సిబ్బంది హాజరయ్యారు. ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ యాజమాన్యం ఆర్థిక సహకారంతో నిర్వహణ సాగింది. క్యాన్సర్ లక్షణాలు నివారణ చికిత్స విధానం గురించి సమగ్రంగా తెలియజేశారు. 2025-27 థీమ్ యూనిటెడ్ బై యూనిక్ కార్యక్రమంలో స్థానిక వైద్య ఆరోగ్యశాఖ వైద్యాధికారిణి డాక్టర్ దేవి కృప మాట్లాడారు. అవగాహనతో క్యాన్సర్ వ్యాధిని దూరం చేయాలని తెలిపారు. కార్యక్రమం అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నుండి బస్టాండ్ సెంటర్ నాలుగు రోడ్ల కూడలి వరకు ప్రభుత్వ విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు.

# విద్యా రంగం, ప్రభుత్వ విద్యా సంస్థలు బలోపేతం చేయాలి

**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరులోని సీపీఎం పార్టీ ఆఫీస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, విద్యారంగం – ప్రభుత్వ విద్యా సంస్థలపై మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ విద్యారంగం దారి–తెన్నూలేని ఒక అస్తవ్యస్త స్థితిలో ఉందని ఒక వైపు స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 పేరుతో ఆర్భాటాలే తప్ప నిర్మాణాత్మక ప్రస్తావన లేదు అని ప్రభుత్వాలు మారినప్పుడల్లా హడావుడిగా మార్పులు తేవడం, ప్రపంచ బ్యాంకు నిర్దేశాలకు లోబడటం,కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని నెత్తికెత్తుకోవడం, ప్రైవేట్ కార్పొరేట్ వ్యక్తులకు భవిష్యత్ తరాన్ని అప్పజెప్పడం వంటి అప్రజాస్వమ్య ఏకపక్ష ధోరణులు ప్రభుత్వాలకు అలవాటుగా మారిపోయిందని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యా విధానం కాలం చెల్లిన చాందసాన్ని, కాషాయా అజెండాని రుద్దడంతో పాటు రాజ్యాంగం లోని ఫెడరల్ స్ఫూర్తి తీవ్రంగా దెబ్బతీస్తోంది అని తెలిపారు. గత ప్రభుత్వం వచ్చి రాగానే ఒక 117 తెచ్చి ప్రాథమిక పాఠశాల వ్యవస్థని అతలాకోతలను చేసి లక్షల మంది పిల్లల్ని బలవంతంగా ఉన్నచోట నుంచి తరలించింది తెలుగు మీడియం రద్దు చేసి అనేక మార్పులు చేసింది ఇదంతా ప్రపంచ బ్యాంకు కనుసన్నల్లోనే జరిగింది దీని అసలు లక్ష్యం ఉపాధ్యాయుల సంఖ్యను తగ్గించడం పాఠశాలలను కుదించడం. ఏ రాష్ట్రంలో లేనట్టు దాదాపు 50శాతం పిల్లలు పాఠశాల విద్యలో ప్రైవేట్ బాట పట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దీన్నంత సవరిస్తామని చెప్పి ఉపాధ్యాయ సంఘాలతో మరో వైపు చర్చలు జరుపుతూ పాత విధాలు అన్నిటిని కొనసాగిస్తుంది. ఇంటర్మీడియట్ విద్యకు వస్తే విద్యారంగాన్ని పరిశీలిస్తే పెద్ద ఎత్తున కార్పొరేట్ చేతుల్లో కేంద్రీకృతమై ఉందనీ, ప్రఖ్యాతిగాంచిన సంస్థల్లో ఇంజనీరింగ్, మెడిసిన్ విద్య పేరుతో లక్షలాదిమంది విద్యార్థులకు ఆశ చూపి పెద్ద ఎత్తున కార్పొరేట్ కళాశాలలో వ్యాపారం చేస్తున్నాయి. కార్పొరేట్ కాలేజీల తీవ్రమైన ఒత్తిడి ఫలితంగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు అని తెలిపారు. రాష్ట్రంలో విద్యా రంగంలో కళాశాలలు కేవలం 169 మాత్రమే ఉండడంతో అందులో చదువుతున్నవారు 80వేలకు ఉంచడం లేదు నామమాత్రపు బడ్జెట్ కేటాయింపులు ఈరంగం నిర్వీర్యం



అయిపోయింది. దీనికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. వీసీల నియామకంలో కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గైడ్ లైన్స్, రాష్ట్రాల హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయి అని పైగా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయంలో సుమారు 5వేల ప్రొఫెసర్ అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేషన్ ప్రొఫెసర్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని విశ్వవిద్యాలయాలు కూడా వ్యాపార దృష్టికి పెంచుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వి.శ్రీనివాసరావు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలనీ డిమాండ్ చేస్తూ జాతీయ విద్యా విధానం 2020 అమల నుంచి రాష్ట్ర ప్రభుత్వం వైదొలిగే దిశగా ప్రయత్నాలు చేయాలని, డీఎస్సీ ప్రకటించి ఉపాధ్యాయ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, మండలానికి ఒక ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఏర్పాటు చేయాలని, కార్పొరేట్ విద్యారంగంపై నియంత్రణ ఉండాలని, అన్ని విశ్వవిద్యాలయాల్లోనూ, ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, వైస్ ఛాన్సలర్, ఇతర అధికారులు నియామకాలు ప్రతిభకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని మతపరమైన నియమాలని నిలిపివేయాలి అని, ఇతర విద్యా విధానంలో పెద్ద ఎత్తున జరుగుతున్న కార్పొరేట్ దోపిడీని నియంత్రించాలని, విద్యారంగానికి బడ్జెట్లో కేటాయింపులు పెంచాలని, అన్ని విభాగాల్లోని ప్రభుత్వ కళాశాలలో లేబరేటరీ సౌకర్యాలు కల్పించాలని, కాంట్రాక్ట్ లెక్చరర్లు, టీచర్లను రెగ్యులరైజ్ చేయాలని, విద్యాహక్కు చట్టం ప్రకారం 8వ తరగతి వరకు మాతృ భాషలోనే విద్య నేర్పాలి అని, ఉన్నత తరగతుల్లో తెలుగు, ఇంగ్లీష్ మీడియం కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మూలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్‌పై నర్సింగ్ విద్యార్థులకు అవగాహన




**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి జవహర్ భారతి కళాశాలలో నిర్వహిస్తున్న ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులు మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా నెల్లూరులోనే రెడ్ క్రాస్ క్యాన్సర్ వైద్యశాల నందు కావలిలో నర్సింగ్ చదువుతున్న విద్యార్థులు క్యాన్సర్ వైద్యశాలకు వెళ్లి అక్కడ వివిధ రకాల క్యాన్సర్ అనారోగ్యంతో బాధపడుతున్న రోగులను వారికి ఎలా ఈ వ్యాధి సోకిందని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నర్సింగ్ విద్యార్థులు ఆ నివారణకు చర్యలు ఎలా తీసుకోవాలి మన నూతన ఆధునిక విధానంలో ఆహార శైలిలో వచ్చిన మార్పులు కారణంగా ఈ క్యాన్సర్ వ్యాధి ప్రబలిందని వారు వారికి అవగాహన కల్పించారు. అలాగే క్యాన్సర్ హాస్పటల్ వైద్యులు డాక్టర్ లక్ష్మి నర్సింగ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. వైద్యశాలలో చికిత్స పొందుతున్న వివిధ రకాల క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు తమ ఆహారపు అలవాట్లు వలన వచ్చిన ఈ క్యాన్సర్ వ్యాధిని ఆధునిక జీవితంలో ఆహారంలో సంపూర్తిగా మార్పు చేసుకొని జీవనశైలి విధానాన్ని మార్చుకోవాలని డాక్టర్ క్షుణ్ణంగా వాటికి కావాల్సిన నివారణలు కూడా తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాన్సర్ వైద్యశాల వైద్యులు, నిపుణులు, అలాగే నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపల్ ఎస్తేర్ బ్యులా పాల్గొన్నారు.

# వైసీపీలో నమ్మకానికి తగిన గుర్తింపు

## - ఇద్దరు కౌన్సిలర్లకు పదవులు



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** వైయస్ ఆర్సీపీలో నమ్మకంగా ఉంటూ మాజీ మంత్రి, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి సూచనల మేరకు అహర్నిశలు కష్టపడిన ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లకు తగిన గుర్తింపు ప్రసన్న కుమార్ రెడ్డి కల్పించడం జరిగింది. ఈనెల మూడవ తేదీన బుచ్చి నగర పంచాయతీ సమావేశ మందిరంలో జరిగిన వైస్ చైర్మన్ ల ఎన్నికలు వైసీపీ నుంచి టిడిపికి సపోర్ట్ చేస్తూ కొంత మంది వైసీపీ ఎమ్మెల్యేలు వెళ్లిన విషయం పాఠకులకు విదృతమే ఈ నేపథ్యంలో వైసిపి కౌన్సిలర్లలో బుచ్చి నగర పంచాయతీ కన్వీనర్‌గా 5వవార్డ్ కౌన్సిలర్ షేక్. షాహుల్, అలాగే వైసీపీ కోవూరు నియోజకవర్గం మహిళ అధ్యక్షురాలుగా 18వ వార్డు కౌన్సిలర్ మోర్ల జయంతి నియమించబడ్డారు. దీంతో వారి శ్రేయోభిలాషులు మిత్రులు వైసిపికి చెందిన నాయకులు కార్యకర్తలు అభిమానులు పలు వర్గాల వారు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.



### ఎమ్మెల్యే సహకారంతో..

# పంచాయతీకి అభివృద్ధి పనులు

**బోగోలు, మేజర్‌న్యూస్ :** కావలి ఎమ్మెల్యే దగుమాటి వేంకట క్రిష్ణారెడ్డి సహకారంతో బోగోలు మేజర్ పంచాయతీకి భారీగా నిధులు సమకూర్చినట్లు మాజీ ఎంపీటీసీబీ చిలకపాటి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ మేరకు బోగోలు పంచాయతీ బేతనిపేట, ఎస్టీ కాలనీలో సిమెంట్ రోడ్లు, సైడు కాలువల నిర్మాణ పనులను చేపడుతున్నారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో 18లక్షలతో సైడ్ కాలువలు, 15లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు చిలకపాటి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నెలాఖరికి పనులను పూర్తి చేసి ఎమ్మెల్యే చేతుల మీదుగా సిమెంట్ రోడ్లను ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకుడు సుభాన్ భాష తదితరులు పాల్గొన్నారు.



# ఆలయాల్లో ప్రత్యేక పూజలు




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని పలు ఆలయాల్లో రథసప్తమి పర్వదినం సందర్భంగా భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు చేర కొని పంచామృతాభిషేకాలు, ఆకు, కుంకుమ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని గండిపాళెం, గుడినరవ, అప్పసముద్రం, కుర్రపల్లి, లింగాలదొన, అయ్యవారిపల్లి, చెరువుపల్లి తదితర గ్రామాల్లో భక్తులు ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు చేపట్టారు.

# మోదీ పాలనలో పల్లెలు అభివృద్ధి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** నరేంద్రమోదీ పాలనలో గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయని మండల బీజేపీ అధ్యక్షుడు మోటపోతుల చెన్నయ్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రవేశపెట్టిన పథకాలను మారుమూల గ్రామాలకు అందేవిధంగా కూటమి భాగస్వామ్యులతో కలిసి పని చేయాలన్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల చెంతకు చేరుస్తున్నారన్నారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కష్టపడాలన్నారు. బీజేపీ పాలనలో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి వైపు సయనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆవుల రోశయ్య యాదవ్, చల్లా సుబ్బరత్నం, కార్తీక్, ఖాజానాయణసూల్, శానంపూడి నరసయ్య, రాంనరేష్ దుగ్గయ్య, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీటీసీ నివాసంలో అగ్నిప్రమాదం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని గుడినరవ గ్రామంలో ఎంపీటీసీ అంబటి భాస్కర్‌రెడ్డి నివాసంలో సోమవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకొంది. రేకుల ఇంటి ముందు వేసి ఉన్న తాటాకు పందిరికి నిప్పంటుకొని పూర్తిగా దగ్ధమైంది. పందిరి కాలిపోతున్న విషయాన్ని ఆయన సోదరుడు గుర్తించి మంటలను చూసేటప్పటికే అప్పటికే పూర్తిగా కాలిపోయింది. తమ వ్యతిరేకియులు ఇంటికి నిప్పంటించారని ఎంపీటీసీ ఆను మానాలు వ్యక్తం చేస్తున్నారు. కాగా సమాచారం అందుకున్న ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి వివరాలు సేకరించి విచారణ జరుపుతున్నారు.

# డెంగ్యూ కేసు ప్రాంతాల్లో నివారణ చర్యలు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** మంగళవారం నెల్లూరు నగరంలోని ఎన్‌బీటీ కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలోని పొదలకూరు రోడ్డులోని లేక్ వ్యూ కాలనీ 9వ వీధిలో అనుమానిత డెంగ్యు కేసు ప్రబలిన ప్రాంతంలో లార్వా సర్వే, పీడీపీ వర్క్, ఫీవర్ సర్వే, ఇండోర్ స్పేస్ స్ప్రేయింగ్ కార్యక్రమాలను పరిశీలించిన జిల్లా సహాయ మలేరియా అధికారి వి.నాగార్జున రావు ఇంటి పరిసరాలలో అనవసరపు నీటి నిలువలను లేకుండా చూసుకొని దోమల పెరుగుదల జరగకుండా చూడాలని తెలియజేశారు. ఆ ప్రాంతంలో దోమ లార్వాను సేకరించి లార్వా పెరుగుదలను ప్రదర్శన ద్వారా చూపించి అవగాహన కల్పించారు. రాత్రిపూట నిద్రించేటప్పుడు దోమతెరలు వాడాలని, స్తోమత ఉన్నవారు ఇంటిని మస్కిటో స్క్రీనింగ్ చేయించుకొని కీటక జీనిత వ్యాధులకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌యుఓలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశలు పాల్గొన్నారు.

# కమిషనర్‌ను కలిసిన ఐఐటీ మద్రాస్ సివిల్ ఇంజనీరింగ్ బృందం

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** ఐఐటి మద్రాస్ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఎస్‌ఎం శివ నాగేంద్ర మార్గదర్శకత్వంలో పరిశోధకుల బృందం, రక్షా గ్రీన్ టెక్నాలజీస్ ప్రతినిధులతో కలిసి మంగళవారం నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజని కలిశారు. ఈ సందర్భంగా వారి కొత్తగా పేటెంట్ పొందిన వాయు కాలుష్య నియంత్రణ సాంకేతికతలు, సుస్థిర జీవ మురుగునీటి శుద్ధి పరిష్కారాలను ఎన్‌ఎంసి, ఏపీపీసీబీ, ఎన్‌సీఏపీ అధికారులకు ప్రదర్శించారు. ప్రొఫెసర్ శివ నాగేంద్ర పరిశోధనా బృందం అభివృద్ధి చేసిన సాంకేతికతలలో రోడ్ డస్ట్ కలెక్టర్, ఆంబియంట్ ఎయిర్ ప్యూరిఫయర్ ఉన్నాయి. రక్ష గ్రీన్ సొల్యూషన్స్, ఐఐటి మద్రాస్ మధ్య పరిశ్రమ-అకాడెమియా సహకారం సూక్ష్మజీవుల సమ్మేళనాన్ని ఉపయోగించి ఫ్లూ గ్యాస్ ఉద్గారాలను నియంత్రించడానికి ఒక పైలట్ అధ్యయనాన్ని అభివృద్ధి చేసింది. ఈ సాంకేతికతలను పైలట్ స్కేల్‌లో అమలు చేయాలని అధికారులు పరిగణిస్తున్నారు. ఈ కార్యక్రమంలో డా.



ఎలిల్ల్ కుమార్, డా. అశ్విన్ గిరి, మహాలక్ష్మి, కుమారి సేతురామన్, వైరముత్తు, కుమారి శ్రావణి ఉన్నారు. రక్షా గ్రీన్ సొల్యూషన్స్ నుండి ప్రతినిధులలో చంద్రమౌళి, రాజీవ్ రామచంద్రన్ పాల్గొన్నారు.

# చేనేతల మీద ఎందుకు ఈ వివక్ష

- 56లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్లో చేనేతల మీద చిన్న చూప
- ఆవేదన వ్యక్తం చేస్తున్న చేనేతలు



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** కేంద్రంలో ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ 2025 సంవత్సరానికీ సంబంధించి ప్రవేశపెట్టిన బడ్జెట్లో చేనేతలకు కేవలం 200 కోట్లే కేటాయించడం బాధాకరమని చేనేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షులు బుధవరపు బాలాజీ కేంద్ర బడ్జెట్‌పై స్పందిస్తూ కేంద్ర బడ్జెట్‌లో చేనేతలను ఆదుకుంటూ ఎక్కువ మోతాదులో నిధులు కేటాయించి చేనేతలకు అవకాశాలు కల్పిస్తారని ఎదురు చూసామని అయితే నేతన్నలకు కేంద్ర బడ్జెట్లో నిరాశ మిగిల్చారని ఇది బాధాకరమని అన్నారు. భారతదేశంలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, కేరళ, గుజరాత్, ఒరిస్సా, బీహార్‌తోపాటు అనేక రాష్ట్రాలలో చేనేత వృత్తులపై ఎంతోమంది ఆధారపడి జీవిస్తున్నారని అయితే 200 కోట్లు మాత్రమే కేటాయించడంపై చేనేతల ఆర్థిక స్థితిని దెబ్బ తీసినట్టయినదిని ఆవేదన వ్యక్తం చేశారు. పుండు మీద కారం చల్లినట్లుగా ఆ ర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉన్న చేనేతలపై చిన్నచూపు చూశారని ఇదేనా నేతన్నలను ఆదుకోవడం అని ఆయన తెలియజేశారు. మగ్గాలపై ఆధారపడి అనేక ఉపవృత్తుల వారు చేనేతలు వస్త్రాలు తయారు చేస్తున్నప్పటికీ ఆర్థిక పరిస్థితికి ఊతం ఇవ్వకుండా ఈ రకంగా 200కోట్లు కేటాయించడం ఏమిటని ఈ విషయంపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవ తీసుకొని చేనేతలను ఆదుకునే విధంగా మరికొంత నిధిని కేటాయించే విధంగా చర్యలు చేపడతారని నేతన్నలు ఇప్పటికి ఆశగానే ఎదురుచూస్తున్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షులు అవ్వరు రామచంద్రయ్య, గుత్తికొండ శ్రీనివాసులు, పద్మశాల యువసేన రాష్ట్ర ప్రతినిధి మునగపాటి రమేష్, పద్మశాలి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సోమగోపాల్ పాల్గొన్నారు.

# పెద్దచెరుకూరు, కనుపర్తిపాడు గ్రామాలలో పొలంబడి

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలం పెద్దచెరుకూరు, కనుపర్తిపాడు గ్రామాలలో వ్యవసాయ శాఖ అధికారులు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్.శ్రీనివాసులు రైతులతో మాట్లాడుతూ.. ప్రస్తుతం వరి పంట కరుకు దశ నుంచి వెన్ను దశలో ఉందని ఈ దశ సున్నిత దశ కావున తప్పనిసరిగా రైతులు పొలాన్ని పరిశీలించి నీటి ఎద్దడి లేకుండా జాగ్రత్తడాలని తెలియజేసారు. అదే విధంగా ఈ దశలో పైరుకు రసాయన ఎరువులు అవసరం లేదు కావున ఈ దశలో రసాయన ఎరువులు ఉపయోగించినట్లయితే సాగు ఖర్చు పెరుగుతుందని తెలియజేశారు. తదుపరి మండల వ్యవసాయధికారి ఎస్‌వీ నాగమోహన్ మాట్లాడుతూ.. బీపీటీ 5204 వరి రకంలో మెడ విరుపు వచ్చే అవకాశం ఉంది కావున నివారణకు ఫ్యూజీవన్ మందును లీటరు నీటికి 2 మిల్లీ లీటర్లు కలిపి పిచికారీ చేసుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా గత సీజను తో పోలిస్తే ఈ సీజనులో వరి పైరులో పురుగులు, తెగుళ్ల సమస్య తక్కువగా ఉందని కావున అవసర




మయితే తప్ప పురుగు మందులను ఉపయోగించాల్సిన అవసరం లేదని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి శేషాద్రి, స్థానిక నాయకులు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వేమిరెడ్డి దంపతులకు ఇస్కాన్ వారు ధన్యవాదాలు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** హరే కృష్ణ మంత్ర ప్రచారమే లక్ష్యంగా నెల్లూరు ఇస్కాన్ సంస్థ ఇటీవల చేపట్టిన 12వ జగన్నాథ రథయాత్ర విజయవంతంపై ఇస్కాన్ బృందం ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది. ఈ మేరకు మంగళవారం కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని విపిఆర్ నివాసంలో కలిసి స్వామివారి ప్రసాదాలు అందజేశారు. ఇస్కాన్ సంస్థ అభివృద్ధికి ఎంపీ వేమిరెడ్డి దంపతులు ప్రతి ఏటా సహాయ సహకారాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మూలాపేటలోని ఆంజనేయస్వామి విగ్రహం నుంచి మొదలైన యాత్రలో వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారని అన్నారు. దీనిద్వారా హరే కృష్ణ మంత్రం జిల్లా అంతటా వ్యాపించిందని చెప్పారు. రథయాత్రలో భాగంగా ముంబయ్ నుంచి వైష్ణవాగ్రి, హొసూర్ నుంచి శ్రీనివాస శ్యాం ప్రభు, ఇతర ముఖ్య వ్యక్తులు పాల్గొని ప్రవచనాలు అందించారన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు ఇస్కాన్ అభివృద్ధికి, రథయాత్రకు తమవంతు సంపూర్ణ మద్దతు అందించారని ఇస్కాన్ ప్రతినిధులు తెలిపారు. రథయాత్ర సందర్భంగా 6 లక్షల ఆర్థిక సహాయం అందించి భక్తుల కొరకు ప్రత్యేక భోజన వసతి కల్పించారన్నారు. ఈ సందర్భంగా వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే ఇస్కాన్ సంస్థ అభివృద్ధికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థులకు టాలెంట్ టెస్ట్



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో బివి రత్తమ్మ మెమోరియల్ ఫౌండేషన్ అధ్యక్షులు ఎన్‌వి ప్రసాద్ రావు ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు గణిత శాస్త్రంలో టాలెంట్ టెస్ట్ ను నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్ట్‌లు విజేతలైన మొదటి బహుమతి కెవిపిఆర్ భార్గవి 98 మార్కులు జడ్పీహెచ్‌ఎస్ బ్రాహ్మణ కాక రెండో బహుమతి జి జ్ఞాపిక 96 మార్కులు జడ్పీహెచ్‌ఎస్ ఇంజమూరు ఎస్ మహాలక్ష్మి మూడవ ర్యాంకు భాష్యం స్కూల్ వారు సాధించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కావలి ఫై సర్వీస్ ఆఫీసర్ రామ్ సిద్ధార్థ ద్వారా విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి విశ్రాంతి వసతి గృహ సంక్షేమ అధికారి షేక్ బాషా ఆధ్వర్యంలో విశ్రాంతి ఉపాధ్యాయులు వై.రఘునాథరావు హ్యాపీ సేవా సంస్థ గని భాష హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముందుగా బివి రత్తమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రత్తమ్మ పేరుమీద విద్యార్థులకు నిర్వహిస్తున్న ఈ ప్రతిభ పోటీల వలన వారికి ఘనమైన నివాళులు అని వారు తెలిపారు.

# ఎన్‌ఎంయూఏ రెండవ మహాసభలు

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఏపీపీటీడీ, ఎన్‌ఎంయూఏ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నెల్లూరు జిల్లా ఎన్‌ఎంయూఏ రెండవ మహాసభలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్, ఎన్‌ఎంయూఏ జిల్లా గౌరవధ్యక్షులు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశములో ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన అన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు పరుస్తోందని, అన్ని వర్గాలకు న్యాయం చేస్తుందని తెలిపారు. ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు రేషన్ కార్డులు ఇచ్చేందుకు, 2004 సంవత్సరానికి ముందు ఆర్టీసీలో ఉద్యోగంలో చేరిన వారికి ఓల్డ్ పెన్షన్ స్కీం అమలు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ రాష్ట్ర, జోనల్, జిల్లా నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# మద్యం షాపుల కొరకు దరఖాస్తు చేసుకోండి

**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** డిప్యూటీ కమిషనర్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ నెల్లూరు వారి ఆదేశాల మేరకు గీత కులాలకు చెందిన వారు మద్యం షాపుల కేటాయింపుకు నోటిఫికేషన్ (2024-26)కు గాను ఏపీ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేశారని ఇందుకూరుపేట ఎక్సైజ్ సీఐ జీవీ ప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గౌడ కులాలు, సబ్ కులాలు వారు సంబంధిత స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కుల ధ్రువీకరణ పత్రము మంజూరు చేయించుకుని ఆపత్రంతో దరఖాస్తు చేసుకోవాలి అని ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఒక వ్యక్తి ఒక షాపుకు ఎన్ని దరఖాస్తులు అయినా చేసుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే ప్రతి దరఖాస్తుకు రెండులక్షల రూపాయలు రుసుముగా చెల్లించవలనని ఎక్సైజ్ సీఐ తెలియజేశారు.

# అనధికార లేఔట్లపై కమిషనర్ చర్యలు

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పురపాలక సంఘ పరిధిలో ఉన్న అణాధికార లేఔట్లపై ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నారని కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ తెలిపారు అనంతరం వారు మాట్లాడుతూ కావలి పట్టణంలోని తుమ్మలపెంట్ రోడ్డు, కొన్నదిన్న గిరిజన కాలనీ దగ్గర గల సర్వేనెంబర్ 1256, 1257, 1258, 1259, 1260,1265, 1267, 1268,1269, 1270, 1274, ఇంకా కొన్ని సర్వే నెంబర్లు సుమారు 45.48 ఎకరంలో అక్రమ లేఔట్లుగా గుర్తించారని, ఈ లేవోట్ల పరిధిలో గల ప్లాట్లు సరిహద్దు రాళ్లను రోడ్లు, కాలువలను జెసిబి ద్వారా వాటిని తొలగించడం జరిగిందని తెలిపారు. లేఔట్ల యందు ఎటువంటి అనుమతులు ఇవ్వబడవని ఈ విషయం ప్రజలకు అవగాహన కల్పించుటకు పత్రిక ప్రకటన విడుదల చేస్తున్నామని తెలిపారు.



# పనులు ప్రారంభించారు..

# ఎప్పుడు మొదలెడుతారు.!

- నత్త నడకన హైవే-325 రోడ్డు పనులు
- వంతెనలు నిర్మాణంతో రోడ్డు ధ్వంసం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

**జలదంకి, మేజర్‌న్యూస్ :** గత వైసీపీ ప్రభుత్వం హయాంలో 2021లో జల దగ్గర నుంచి తెల్లపాడు మీదగా కలిగిరి మండలంలోని గ్రామాల్లోకి వెళ్లే సింగిల్ రోడ్డును హైవే-325 రోడ్డుగా మార్చేందుకు 20కోట్లతో టెండర్లు పిలిచింది. పనులు దక్కించుకున్న జీఎస్ఆర్ ఇన్ఫ్రా సమస్త అప్పటి ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి చేతుల మీదగా పనులు ప్రారంభించింది అయితే ఆ పనులు నత్త నడకన సాగడంతో అవి ఇప్పటికీ మిగిలిపోయాయి. అసంపూర్తిగా మిగిలిపోయాయి. మండలంలోని టెంక వారి పాలెం, గోపన్న పాలెం, రోడ్డు గట్టుపల్లి రోడ్డు, అన్నవరం రోడ్డు, దాసరి అగ్రహారం, తిమ్మసముద్రం గ్రామాల నుండి కలిగిరి మండలం తెల్లపాడు రోడ్డు కొనసాగాలి క్రమంలో దాసరి అగ్రహారం, తిమ్మసముద్రం గ్రామాల సమీపంలోని వాగులు, వరద నీరు వెళ్లే ప్రాంతాల్లో కలవట్లు, వంతెలను నిర్మాణలు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. కాంట్రాక్టర్ చేసిన పనులకు నిధులు మంజూరు కాలేదని పనులు నిలిపివేశారు. ఆ తరువాత అధికారం లోకి వచ్చినకు టమే ప్రభుత్వం మూడు నెలలు క్రితం నాలుగు కోట్లు బిల్లు మంజూరు చేసింది. అయినా సదరు కాంట్రాక్టర్ మాత్రం పనులు ప్రారంభించలేదు.

### సాఫీగా ఉన్న రోడ్డు ధ్వంసం

జలదంకి-తెల్లపాడు ఉన్నప్పుడు సింగిల్ లైన్ రోడ్డు ఉన్నప్పుడు ఎక్కడ గతుకులు లేకుండా వాహనదారులు గుంతలు లేకుండా సాఫీగా ప్రయాణించేవారు. ఈ రోడ్డును స్టేట్ హైవేగా మార్పు చేసి రెండు లైన్లు రోడ్డుగా మారుస్తామని బాగున్న రోడ్డును ధ్వంసం చేయడం, కలవట్ల స్థానంలో వంతెనల నిర్మాణం చేపట్టే క్రమంలో వంతెనలు తొలగించి డైవర్షన్లు ఏర్పాటు చేయడం, అంతేకాక రోడ్డు ఇరువైపులా కంకర తోలి వదిలేశారు. రోడ్డు కట్ చేసిన చోట వాహనాలు వెళ్ళేందుకు ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో అయితే కలవట్లు, డైవర్స్‌ల వర్షపు నీరు పొంగి పారడంతో సుమారు 20 గ్రాముల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి జలదంకి టు తెల్లపాడు రోడ్డు పనులను ప్రారం భించాలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

### పనులు చేయమనినో డిస్లు ఇచ్చాం

**కె.చక్రధర్ రావు, ఆర్ అండ్ బి డీఈ**

గతంలో జలదంకి- కల్లపాడు రోడ్డు పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్‌తో జీఎస్ఆర్ ఇన్ఫ్రా సమస్తకు నోటీసులు ఇచ్చాం.. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. పనులు ప్రారంభమయ్యేలా, మేము కూడా చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు.

## రంగనాధ స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా నెల్లూరు నగరంలోనీ రంగనాయకులపేట వేంచేసియున్న శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానం నందు మంగళవారం రోజున రథ సప్తమి వేడుకలు ఘనంగా జరిపారు. రథ సప్తమి సందర్భంగా దేవస్థానం వారు శ్రీ రంగనాథ స్వామికి సప్త వాహన సేవలు నిర్వహించారు. ఉదయం సూర్యప్రభ, గరుడ సేవ, సింహవాహనం, హంసవాహనం సేవలు మధ్యాహ్నం తిరుమంజనం, బంగారు తిరుచ్చి సేవలు, సాయంత్రం పెద్ద శేషవాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం అత్యంత వైభవంగా జరిపారు. ఈ సేవలలో పాల్గొనడానికి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులు స్వామి వారిని దర్శించి వారి సేవలో మునిగి తేలారు. మహిళలు కోలాటాల నృత్యంతో అలరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారని కార్యనిర్వహణాధికారి ఆళ్ళ శ్రీనివాసరెడ్డి, చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్తల మండలి వారు తెలిపారు.



## వైసీపీ కార్పొరేటర్లపై చర్యలు తీసుకోవాలి

### ఎన్నికల ప్రిసైడింగ్ అధికారికి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి వినతి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో వైసిపి జారీ చేసిన విప్‌ను ఉల్లంఘించిన కార్పొరేటర్లపై చర్యలు తీసుకోవాలని మంగళవారం ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి కార్తీక్‌ను కలిసి వైసిపికి చెందిన నెల్లూరు సిటీ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, పలువురు వైసిపి కార్పొరేటర్లు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ నగర నియోజక వర్గ కార్పొరేటర్లు డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో విప్ ఉల్లంఘించి వైసిపి అభ్యర్థికి కాకుండా ఇండిపెండెంట్ అభ్యర్థికి ఓటు వేసిన వైసీపీ కార్పొరేటర్ల పై అనర్హత వేటు వేయాలని కోరారు. తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా ఓటు వేసిన కార్పొరేటర్లపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్, హంజా హుస్సేనీ, కార్పొరేటర్లు కరీముల్లా, వేలూరు ఉమా మహేష్, ఊటుకూరు నాగార్జున, నేతాజీ సుబ్బారెడ్డి, నీలి రాఘవరావు, బొబ్బల శ్రీనివాస్ యాదవ్, కామాక్షి దేవి, గుంజి జయలక్ష్మి, వైసిపి నాయకులు పేర్నేటి కోటేశ్వర రెడ్డి, రవూఫ్, మున్వర్, అలీం తదితరులు పాల్గొన్నారు.



సూర్య

విలేకర్లు కావలెను

తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

నెల్లూరు జిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెం, సంగం, కొడవలూరు, వెంకటాచలం,మనుబోలు, అల్లూరు, దగదర్తి, వింజమూరు దుత్తలూరు. నెల్లూరు పట్టణంలో దర్గామిట్ట, స్టోన్‌హౌస్‌పేట, వేదాయపాళెం, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను.

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

నేటి దినపత్రిక సూర్య కార్యాలయం
మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిఐడి ఆఫీసు ఎదురుగా,
కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు
9000118811, 9963827227

## శ్రీవారి రథ సప్తమి వేడుకల్లో ప్రశాంతిరెడ్డి



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి రథ సప్తమి వేడుకలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. తెల్లవారుజామునుంచే ప్రారంభమైన వాహన సేవలు భక్తులను తరింపజేస్తున్నాయి. రథ సప్తమి వేడుకల సందర్భంగా కోవూరు ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబర్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తిరుమల శ్రీ వారి వాహన సేవలో పాల్గొన్నారు. తెల్లవారు జామున నిర్వహించిన సూర్య ప్రభ వాహన సేవలో టిటిడి బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామల రావు, ఇతర బోర్డు సభ్యులతో కలిసి ఆమె వాహన సేవలో పాల్గొని శ్రీవారి ఆశీస్సులు అందుకున్నారు. రథసప్తమి ఏర్పాట్లపై ఆయా అధికారులతో ప్రశాంతి రెడ్డి మాట్లాడారు.

## మున్సిపల్ కమిషనర్‌తో రూరల్ ఎమ్మెల్యే భేటీ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర కార్పొరేషన్ కార్యాలయంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 1వ డివిజన్ సమస్యలపై కమిషనర్ సూర్యతేజను మంగళవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఆయన నెల్లూరు రూరల్ పరిధిలోని అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకుని వెళ్లారు. అనంతరం నెల్లూరు నియోజకవర్గ పరిధిలోని జరుగుతున్న అభివృద్ధి పనులపై కార్పొరేషన్ ఎస్సీ, ఈఈలతో ప్రత్యేకంగా చర్చించారు.

# జాతీయ భద్రత మాసోత్సవాలు

**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బందికి 36వ జాతీయ రహదారి మాసోత్సవాలు సందర్భంగా మంగళవారం వైద్యశాల సిబ్బందికి కావలి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కే కరుణాకర్ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ఎక్కువ శాతం ప్రజలు ప్రాణాలు కోల్పోవడానికి ముఖ్య కారణాలు వాహనం నడుపుతూ సెల్ఫోన్ మాట్లాడటం, మితిమీరిన వేగం, మద్యం సేవించి వాహనం నడపడం, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం, కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులు సీటు బెల్టును తరించకపోవడంతో అధిక శాతంలో ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో కావలి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కే.కరుణాకర్, బి.లక్ష్మీబాయి ఆధ్వర్యంలో రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనదారులు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారు తమ ప్రాణాలను కోల్పోకుండా హెల్మెట్లను ధరించాలని, కారులో ప్రయాణిస్తున్న వారు తప్పకుండా సీటు బెల్టును ధరించడంతో ప్రమాద సమయంలో ప్రాణాలు కోల్పోకుండా నివారించ



అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఎక్కువ ప్రమాదాలు ద్విచక్ర వాహనదారులకు జరుగుతుందని రోడ్డుపై ప్రయాణిస్తున్నప్పుడు రూల్స్ తప్పక పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.స్వరూప రాణి రోడ్ సేఫ్టీ ఆఫీసర్, డాక్టర్ బి.పవన్ కుమార్ కోవూరు పల్లి, డాక్టర్ పి.రాజశేఖర్, ఆర్.సులోచనమ్మ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి : సీఐ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ట్రాఫిక్ నిబంధనలను అందరూ తప్పకుండా పాటించాలని ఆత్మకూరు సీఐ జి.గంగాధర్ కోరారు. రోడ్డు భద్రతామాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు, ప్రమాదాలు జరుగకుండేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలగురించి వివరించే కరపత్రాలను అందరికీ పంపిణీ చేశారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా సిఐ గంగాధర్ మాట్లాడుతూ.. వాహనాలను డ్రైవర్లు జాగ్రత్తగా నడపాలని, మితిమీరిన వేగం తగదని, అధికంగా ప్రయాణీకులను ఎక్కించుకోరాదని, రోడ్డుపై ఎక్కడబడితే అక్కడ వాహనాలను నిలుపరాదని సూచించారు. మద్యంసేవించి వాహనాలు పడపరాదని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని, ద్విచక్రవాహనకారులు హెల్మెట్లు, కార్లు నడిపేవారు సీట్‌బెల్టులు ధరించాలని, ట్రాఫిక్ నియమావళి పాటించాలని, ప్రమాదాలు జరుగకుండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఏదేని ప్రమాదాలు జరిగినపుడు వెంటనే డ్రైవర్లే క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించాలని, లేదా 108వాహనానికి ఫోన్‌చేయాలని కూడా గంగాధర్ సూచించారు. వాహనాలను నడిపేసమయంలో డ్రైవర్లు ప్రశాంతంగా విధులు నిర్వహించాలని, ముందువాహనాలను క్రాస్‌చేయాలన్న ఆలోచన విరమించుకోవాలని, ఎదుటి వాహనాలను జాగ్రత్తగా తప్పించాలని ఆయన కోరారు. ఈమేరకు అందరికీ అవగాహన లక్ష్యించేలా రూపొందించిన కరపత్రాలను విద్యార్థులకు, డైవర్లకు, ఇతర వాహనాల డ్రైవర్లకు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో స్థానిక ఎస్‌ఐలు షేక్ జిలానీ, ఎస్.సాయిప్రసాద్, పోలీస్‌సిబ్బంది, పలు వాహనాల డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# తహసిల్దార్ కార్యాలయం ఆర్డీఓ ఆకస్మికంగా తనిఖీ

**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్పేట మండల తహసిల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆత్మకూరు ఆర్డీవో బి.పావని ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ప్రస్తుతం మండలంలోని కుప్పురుపాడు గ్రామంలో జరుగు తున్న రీ సర్వేపై పలు విషయాలను అడిగి తెలుసు కున్నారు. ఈ మేరకు గ్రామంలో ప్రభుత్వ భూము లను గుర్తించడం జరిగిందని గ్రామ విలేజ్ బౌండరీ ప్రభుత్వ భూములలో సగం గుర్తించడం జరిగిందని తహసిల్దార్ రీసర్వే డిటి ఆర్డీవోకు తెలిపారు. అలాగే గత ప్రభుత్వంలో మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన రీ సర్వే లో అవకతవకలు జరిగినట్లు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పందిపాడు గ్రామంలో సుమారు 100 ఎకరాలు మేర రీ సర్వేలో అవకతవ కలు జరిగినట్లు గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో విచారణకు వచ్చినట్లు ఆర్డీవో పావని తెలిపారు గ్రామంలో రీ సర్వే సమయంలో ఒకరికి చెందిన



భూములను మరొకరి పేరు మీద తోపు పోరంబోకు భూములను సైతం పైసలు ఇచ్చిన వారికే వారి పేర్లను నమోదు చేశారని గ్రామానికి చెందిన కొందరు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు చేపట్టి తమకు న్యాయం చేయాలని పందిపాడు గ్రామానికి చెందిన లబ్ధిదారులు కోరుతున్నారు.

# రథసప్తమి సందర్భంగా స్వామివారికి సూర్యప్రభ వాహన సేవ



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం కొండ బిట్రగుంట ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు మంగళ వారం రథసప్తమి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సూర్యప్రభ వాహనం సేవ అత్యంత అంగరంగ వైభవంగా ఆలయ ఈవో ఆరవ రాధాకృష్ణ సూచన మేరకు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ ఈపూరి సత్యనారాయణ చార్యులు ఆధ్వర్యంలో కొండ్రాజు సుబ్బరాజు హైదరాబాదు సహకారంతో కన్నుల పండుగగా జరిగింది. ఈ కార్యక్రమం లో కొండ్రాజు సుబ్బరాజు ఆదిత్య హృదయం పుస్తక ఆవిష్కార కార్యక్రమా న్ని ప్రధానార్చకులు ఈపూరు సత్యనారాయణ చార్యులు, కొండ్రాజు సురేంద్ర రాజు, ఆలయ ఈవో రాధాకృష్ణ శ్రీనివాసరాజు, రెడ్ క్రాస్ సీనియర్ స్టేట్ కోఆర్డినేటర్ గంటా వెంకట్ రవికుమార్, గ్రామస్తులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆదిత్య హృదయం పుస్తకావిష్కరణను చేయడం జరిగింది. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఆధ్వర్యంలో కొండ్రాజు సుబ్బరాజు సహకారంతో ఆదిత్య హృదయం పై ప్రవచనాన్ని శ్రీ కోగంటి వేణుగోపాల కృష్ణమాచార్యులు వారిచే వీనులు విందైన ప్రవచనాన్ని నిర్వహించడం జరిగింది.

# ఏరియా వైద్యశాలలో ఏఎన్ఎం, ఆశ ఉద్యోగుల సమావేశం




**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి ఏరియా వైద్యశాలలో డిప్యూటీ కార్యాల యం నందు డాక్టర్ బ్రిజిత ఆధ్వర్యంలో కావలి డివిజన్ ఏఎన్ఎం, ఆశా ఉద్యోగుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లా డుతూ.. ఫిబ్రవరి 4న ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా క్యాన్సర్ను చేద్దామని నినాదం త్రోట్ క్యాన్సర్‌కు కారణాలు మనం ప్రతి రోజు తినే ఆధునిక జీవన శైలి ప్రధాన కారణమని అలాగే మద్యం, పొగ త్రాగడం, ఆహార పదార్థాల్లో రంగులు వినియోగం, రసాయనాలు వాడడం, హార్మోన్లు అధికంగా వాడడం, అధిక బరువు, కాలుష్యం, క్రిమి హస్సంహార కాలు, చికిత్సలో భాగంగా లేదా ప్రమాదవశాత్తు రేడియే షన్కు, గురికావడం తరచూ వేధించే అనేక రకమైన ఇన్ఫెక్షన్లు క్యాన్సర్‌కు ఇవన్నీ కారకాలని పూర్తిగా ఈ సమావేశంలో వారికి వివరించారు. అనంతరం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు సందర్భంగా డాక్టర్ పద్మావతి ఏరియా వైద్యశాలలో సూపరిడెంట్, రెండవ పట్టణ ఎస్ఐ కలీం మాట్లాడుతూ.. రహదారి ప్రమాద బాధితులకు సహాయం చేయడం ప్రతి ఒక్కరి, మన బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రహదారి ప్రమాదాల్లో మృతి చెందుతున్నారని, ప్రమాదం జరిగినప్పుడు ప్రమాద బాధితులను మొదటి 60 నిమిషాల లోపు వైద్యశాలకు తీసుకు వెళ్ళగలిగిన సదుపాయాలు ఉంటే చేర్చగలిగితే, మరణాల శాతం తగ్గుతాయని విధిగా అందరూ హెల్మెట్లు ధరించి ప్రయాణంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి పట్టణ ఎన్జీవోస్ నాయకులు శివకుమార్ ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆదర్శమూర్తి కందప్ప మేస్త్రి

**జయంతి కార్యక్రమంలో వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి**

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ఆరణీ కందప్ప మేస్త్రి చిర స్మరణీయులని ఆయన సేవలు నేటి తరానికి ఆద ర్శమని నారా యణ విద్యా సంస్థల జనరల్ మేనేజర్, తెలుగు దేశం పార్టీ సీని యర్ నాయకులు



వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నెల్లూరు నగరంలోని స్థానిక సంతపేట నందుగల ఆరణీ కందప్ప మేస్త్రి సత్రం నిర్మాణ దాత కందప్ప మేస్త్రి జయంతి కార్యక్రమానికి వేమిరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కందప్ప మేస్త్రి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కందప్ప మేస్త్రి సత్రం గురించి తాను చిన్నతనంలో విన్నానని, అప్పట్లోనే కనికల్ ఆసుపత్రి కి వచ్చే పోయే రోగులకు వసతి ఏర్పాట్లు చేసే వారని తెలిపారు. ఆయన సేవలను గుర్తించి బ్రిటిష్ వారు సత్రం నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించడం జరిగిందన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రతి ఏడాది కందప్ప మేస్త్రి జయంతి సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు ప్రతిభ గలిగిన పేద విద్యార్థులకు స్కాలర్షిప్లు, నిరుపేదలకు దుప్పట్లతోపాటు దోమతెరలు, చాపలు, పేద బ్రాహ్మణ దంపతులకు వస్త్ర దానం తదితర కార్యక్రమాలే కాకుండా విశ్వభారతి అందుల పాఠశాలలో పిల్లలకు అవసరమైన కిట్లను, దివ్యాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ ఏడాది ప్రత్యేకంగా రైల్వే స్టేషన్, బస్టాండ్ ప్రాంతాలలో నడవలేని వృద్ధులకు వీల్ చైర్‌లను అందజేశారన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమని వేమిరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ జనార్దన్ రెడ్డి సత్రం కార్యనిర్వాహణాధికారి ఆర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి, 47వ డివిజన్ కార్పొరేటర్ రామకృష్ణ, స్థానిక టిడిపి ముఖ్య నాయకులు కపిర శ్రీనివాసులు, కప్పిర రేవతి, నిర్వాహకులు పాల్గొన్నారు.